
సాక్షి గుంటూరు

మంగళవారం, 1, అక్టోబర్, 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



వాహనాల తనిఖీలు

మాచర్ల: పట్టణంలోని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషారెడ్డి సోమవారం గుంటూరు, శ్రీశైలం, సాగర్ ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,991 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 36,887 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

నాణేలను తిరస్కరించవద్దు

కొరిటెపాడు(గుంటూరు): చలామణిలో ఉన్న నాణేలను తిరస్కరించొద్దని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి సూచించారు. అలా తిరస్కరించే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. నాణేలను ఆర్థిక, సామాజిక, సాంస్కృతికత, కాలానుగుణంగా విడుదల చేస్తారని తెలిపారు. ప్రస్తుతం 1, 2, 5, 10 రూపాయల నాణేలు చలామణిలో ఉన్నాయని తెలిపారు. ఈ నాణేల వాస్తవికతపై కొన్ని వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, దీంతో వ్యాపారులు, దుకాణదారులు వీటిని తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా రూ.10 నాణేలను తిరస్కరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని బ్యాంక్ శాఖల్లోనూ నాణేలను మార్పిడి చేసుకోవచ్చని చెప్పారు. ఈ మేరకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 2019 జనవరి 14న ప్రత్యేకంగా బ్యాంకులకు సూచనలు ఇచ్చిందని ఎల్‌డీఎం తెలిపారు.

చిన్నారుల రక్త నమూనాల సేకరణ




ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో చిన్నారులు తీవ్రమైన దద్దుర్ల బారిన పడుతున్నారంటూ ఈ నెల 27వ తేదీన 'సాక్షి'లో 'చిన్నారులపై దద్దుర్ల పంజా' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమయ్యింది. సోమవారం ప్రత్తిపాడులోని మూడు సచివాలయాల పరిధిలో ర్యాండమ్‌గా పది శాంపిల్స్‌ను సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపి దద్దుర్లు ఎందుకు వస్తున్నాయనేది నిర్ధారించనున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అక్టోబర్ 1 నుంచి రెండు రోజుల పాటు 28వ రాష్ట్రస్థాయి అండర్ -19 సెపక్ తక్రా బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, అధికారులు హాజరు కానున్నారు. సత్తెనపల్లి ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. దీనిలో భాగంగా సోమవారం క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. పోటీలకు హాజరయ్యే బాలబాలికలకు భోజనం, వసతులు కల్పించనున్నారు. పోటీలను మంగళవారం సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించనున్నారు. అక్టోబర్ 2న పోటీల ముగింపులో భాగంగా విజేతలకు బహుమతుల పంపిణీలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీల ఏర్పాట్లను ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు పర్యవేక్షించారు. ఆయనతో పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కార్యదర్శి అనిల్ దత్తానాయక్, మండల కార్యదర్శి లాకు పిచ్చియ్య, పీడీ పుచ్చకాయల శివరామకృష్ణ ఉన్నారు.

యార్డుకు 52,124 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 52,124 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,264 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 9,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 18,500 వరకు పలికింది. తాలు రకానికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 27,326 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సెంచరీ దాటిన ఉత్సాహం

నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

వృద్ధులంటే ఒంట్లో సత్తువ లోపించి, మూలన కూర్చున్న వారు కాదు.. జీవన సమరంలో అలుపెరగని పోరాటం చేసి, సమస్యలను సవాళ్లుగా స్వీకరించి, జీవితంలో నిలిచి గెలిచిన వారు.. ముందు తరాలకు తప్పుఒప్పులు తెలియజేసే దారి దీపాలు.. కంటి ముందు నిలిచిన నిలువెత్తు ఆదర్శాలు.. కళ్లకు నిత్యం కనిపించే దేవతల ప్రతిరూపాలు. వృద్ధుల సమస్యల్ని పట్టించుకుని వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1990 డిసెంబరు 14న చేసిన తీర్మానం ప్రకారం ప్రతి ఏటా అక్టోబరు ఒకటిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శత వసంతాలను అధిగమించినవారు, చేరువవుతున్న వృద్ధులు ఎందరో ఆరోగ్య జీవనం గడుపుతున్నారు. తమ పనులను తామే చేసుకుంటూ, పలువురికి ఆదర్శంగా జీవిస్తున్నారు. అలాంటి నలుగురి పరిచయమే ఈ కథనం. – తెనాలి



విశ్రాంతమ్మకు శత వసంతాలు



తెనాలి రూరల్ మండల గ్రామం తేలప్రోలుకు చెందిన వేజండ్ల విశ్రాంతమ్మకు ప్రస్తుతం వందేళ్లు. వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్న వయసు నుంచి పొలం పనులకు వెళుతూ వచ్చారు. అందుకే చదువుకోలేదు.

పెళ్లయ్యాక భర్త హరోన్ అలియాస్ ప్రసాద్‌తోపాటు వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమయ్యారు. అయిదుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అందరినీ పెంచి పెద్దచేశారు. వివాహాలు బాధ్యతలను నెరవేర్చారు. మనవలు ఉన్నారు. వందేళ్ల వయసులోనూ విశ్రాంతమ్మకు ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవు. ఇటీవలే కొద్దిగా బీపీ కనిపించిందని ఆమె కుమారుడు వేజండ్ల రత్నం చెప్పారు. ఆప్పటికీ ఆమె తన పనుల్ని చేసుకుంటున్నారు. మనవలతో కాలక్షేపం. ఇంకా ఖాళీ ఉంటే టీవీ చూస్తూ గడుపుతున్నారు.

అంజమ్మ ఆత్మవిశ్వాసానికి సలాం



స్థానిక నెహ్రూ రోడ్డులో రజక చెరువు వద్ద బొగ్గులు చిల్లరగా విక్రయిస్తుండే కడప అంజమ్మను చూస్తే ఆమె ఆత్మవిశ్వాసానికి సలాం చేయాలనిపిస్తుంది. ఆమె వయసు 95 ఏళ్లు. బిడ్డలు పోషించగలిగే స్థితిలో ఉన్నా, ఎవరిపైనా ఆధారపడకుండా ఒంటరిగా జీవిస్తోంది. ఇస్త్రీ బండి వేసే భర్త సుబ్బారావు పాతికేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. నలుగురు పిల్లలు. పెళ్లిళ్లు చేశారు. ఒంట్లో సత్తువ ఉన్నందున ఎవరిపైనా ఆధారపడాలని చూడలేదు. 1997లో అక్కడే కట్టుకున్న ఇంటిలో కింది భాగాన్ని విక్రయించి, పైభాగంలో నివసిస్తోంది. కొంతకాలం కూరగాయలు విక్రయించింది. కొన్నేళ్లుగా బొగ్గుల వ్యాపారం కొనసాగిస్తోంది. రోజుకు రూ.100 నుంచి రూ.200 ఆదాయం కళ్లచూస్తోంది. ప్రభుత్వ పింఛను డబ్బులకు తోడు ఆర్జిస్తున్న సంపాదనతో బేషుగ్గా జీవిస్తోంది. రోజూ ఉదయం అల్పాహారం సొంతంగానే చేసుకుంటోంది. దగ్గర్లో ఉంటున్న చిన్నకోడలు రెండుపూటలా భోజనం సమకూరుస్తోంది. పలకరిస్తే కబుర్లు ఎన్నో చెప్తుంది అంజమ్మ. స్వరాజ్య ఉద్యమంలో తెనాలి వచ్చిన గాంధీజీని చూశాననీ మెరిసే కళ్లతో చెప్పింది. అంజమ్మ చేసేది నల్లని బొగ్గుల వ్యాపారం అయినప్పటికీ ఆమె ఆదర్శం వెన్నెలంత స్వచ్ఛమైంది.

సమీకృత ఆహారమే ఆరోగ్య రహస్యం



ఈయన పేరు పులివర్తి వీరబ్రహ్మం. విశ్రాంత ఉపాధ్యాయుడు. పౌరోహిత్యం చేస్తున్నారు. ప్రవృత్తిగా చిత్రలేఖనం, కవిత్వంలో కృషి చేస్తున్నారు. సొంతూరు బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామం. 1927లో జన్మించారు. ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివారు. తెనాలికి చెందిన పాములపాటి వెంకటకృష్ణయ్య జిల్లా బోర్డు ప్రెసిడెంటుగా ఉన్నపుడు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. చందలూరు, వలపర్ల గ్రామాల్లో పనిచేసి 1985లో రిటైరయ్యారు. విద్యార్థులకు బోధనతోపాటు తాను పనిచేసిన పాఠశాలల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పడ్డారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించారు. వీరి సేవలకు మెచ్చిన చందలూరు గ్రామస్తులు 1973లో బంగారు ఉంగరంతో సత్కరించారు. తెనాలిలో స్థిరపడ్డారు. ఈ వయసులోనూ ఆయన ఉత్సాహంగా రోడ్డుపై నడిచివెళుతుంటారు. బీపీ, షుగరు వంటి ఇబ్బందులులేవు. సాహిత్య సభలకు, 'మానవత' సభ్యుడిగా సంస్థ కార్యక్రమాలకు హాజరవుతుంటారు. సమీకృత ఆహారమే తన ఆరోగ్య రహస్యమని చెబుతారు.

వయసుతో పనిలేదు



చెంచుపేట అమరావతి కాలనీలో ఉంటున్న రావులపల్లి రాజారావుకు ఇప్పుడు 104 ఏళ్లు. ఇప్పటికీ కళ్లజోడుతో పనిలేదు. దినపత్రిక చదువుతారు. టీవీలో న్యూస్ చూస్తుంటారు. స్వీట్లు ఇష్టంగా తింటారు. దస్తావేజులు రాస్తూ, చదువుతూ సలహాలు ఇస్తుంటారు. ఒత్తిడి లేకుండా, నియమబద్ధ జీవనశైలితోనే శతాధిక సంవత్సరాల వయసులోనూ ఆరోగ్యకర జీవనం సాధ్యపడిందని చెబుతారు. రాజారావు సొంతూరు చుండూరు మండల గ్రామం యడ్లపల్లి. 1920లో జన్మించారు. ఇరవై ఏళ్లకే పెళ్లి. గ్రామంలో పార్ట్‌టైమ్ పోస్టుమాస్టరుగా చేశారు. అందులో 46 ఏళ్లు చేసిన రాజారావు, గత 76 ఏళ్లుగా డాక్యుమెంటు రైటర్‌గానూ చేస్తున్నారు. ఇప్పటికీ దస్తావేజులు రాస్తూనే ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. జైలుకు వెళ్లలేదు. యడ్లపల్లి రైల్వేస్టేషను బయట గాంధీజీని చూశారు. ఖద్దరు వస్త్రాలే శాశ్వతమయ్యాయి. రాజగోపాలచారి ప్రసంగాలు విన్నారు. తెనాలి వచ్చినపుడు జవహర్‌లాల్ నెహ్రూనూ చూశారు. ముగ్గురు సంతానం. అందరూ స్థిరపడ్డారు. తన పనులు తానే చేసుకుంటున్నారు. రోజూ ఉదయాన్నే కొద్దిసేపు ఇంటిముందు నడక. స్నానపానాదుల తర్వాత పేపరు చదవడం, ఏవైనా దస్తావేజులు ఉంటే రాయడం, లేనిపక్షంలో టీవీ వార్తలు చూస్తూ గడుపుతారు. ఏళ్లతరబడి సైకిలు ప్రయాణం, మూడు దశాబ్దాలపాటు తీసుకున్న దంపుడు బియ్యం ఆహారం మినహా ప్రత్యేకంగా తానేం జాగ్రత్తలు పాటించలేదని రాజారావు చెప్పారు.

నేటి నుంచి విధులకు రాం రాం !

ఎంఎల్ డిపో అధికారులకు తేల్చి చెప్పిన ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బంది



అసిస్టెంట్‌డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

తెనాలి రూరల్: ఉద్యోగ భద్రత కల్పించే వరకు అక్టోబర్ 1 నుంచి విధులకు హాజరుకాబోమని ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఐఎంఎల్ డిపో అధికారులకు తేల్చి చెప్పారు. నూతన మద్యం పాలసీ విధానాన్ని రద్దు చేసి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ భద్రత కల్పించాలని తెనాలి డిపో కమిటీ అధ్యక్షుడు పినపాటి కొండలరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో ఐఎంఎల్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.కొండలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోతే అక్టోబర్ ఒకటి నుంచి రాష్ట్ర నాయకత్వంతో పాటు నిరవధిక సమ్మెకు దిగనున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో రాష్ట్రవ్యాప్తంగా 3,600 మంది అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహించే విధంగా గత ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ నూతన మద్యం పాలసీ విధానం తమకు అన్యాయం చేస్తోందని తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్హతను బట్టి నియామకాలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పినపాటి వంశీ వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, ధనరాజుపల్లి సురేష్, భాస్కర్, గోపి, ప్రకాష్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, నాగూర్, సందీప్ పాల్గొన్నారు.

శివాలయంలో వైభవంగా పవిత్రోత్సవాలు

పెదకాకాని: స్థానిక శివాలయంలో పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారము ఉదయం మంగళవాయిద్యం, చతుర్వేద పారాయణలు, గణపతి హోమం, లక్ష్మీ హోమం, అస్త్ర హోమం, నవగ్రహ హోమం, గోపూజ, మంత్రపుష్పం, హారతి, విభూతి, కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం మంగళవాయిద్యం, గణపతిపూజ, ప్రధాన కుంభ అలంకారం, ప్రథమ కాలయాగ శాల పూజ, వేదికార్చనం, మండలార్చనం, శివాగ్ని హోమం పవిత్ర ప్రతిష్ఠ పూజ, జపం, హోమం, గంధ పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యహోమం, పూర్ణాహుతి ఉపచారం, మంత్రపుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. పూజలను డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షించారు. మూడవ రోజు మంగళవారం పూజలతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో సీఐల బదిలీలు

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో సీఐలను బదిలీలు చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు- 1 సీఐగా బి. లత, గుంటూరు- 2కు ఎం. యశోధరా దేవి, ప్రత్తిపాడుకు వై. అశోక్‌కుమార్, మంగళగిరికి జి. వీరాంజనేయులు, తెనాలికి ఏ.వి.చలం, పొన్నూరుకు ఎం. రమేష్, బాపట్లకు పి. గీతిక, రేపల్లెకు ఆర్. దివాకర్, వేమూరుకు ఎ. రవి, నగరానికి ఎం. శ్రీరామ్‌ప్రసాద్, చీరాలకు పి.నాగేశ్వరరావు, పర్చూరుకు ఎం. భుజంగరావు, అద్దంకి ఎ. భువన, చిలకలూరిపేటకు కొడాలి వినయ్‌కుమార్, సత్తెనపల్లికి పి. విజయ్‌కుమార్, క్రోసూరుకు టి.తులసి, పిడుగురాళ్లకు కె. కర్ణ, గురజాలకు కె. బుజ్జిబాబు, మాచర్లకు ఎస్. వెంకటరమణ, వినుకొండకు డి. శ్రీనివాసరావు, ఈపూరుకు డి. వెంకటేశ్వర్లు, పెదకూరపాడుకు వి. శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐల బదిలీలు

గుంటూరు- 1 ఎక్సైజ్ ఎస్ఐలుగా ఎండీ. ఖాశీం షరీఫ్, పి తిరుమలేశ్వరరావు, గుంటూరు -2కు సీహెచ్. మాధవి, పి.ఆర్.కె. మూర్తి, కె. సత్యనారాయణ, ప్రత్తిపాడుకు ఎం. రవీంద్రబాబు, మంగళగిరికి ఎ. పద్మజ, కె. రవికుమార్, జె. భాస్కర్‌రావు, తెనాలికి టి. ఫణికుమార్, ఆర్. శ్రీనివాసరావు, పొన్నూరుకు జి. శివరామ్‌ప్రసాద్ నియమితులయ్యారు. ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలుగా ఎస్‌డీహెచ్ రెహిమాన్, ఎస్ శ్రీనివాసరావు, ఈఎస్‌టీఎఫ్ గుంటూరు ఎస్ఐగా పి. కృష్ణారెడ్డి, ఐఎంఎల్ గుంటూరు డిపో ఎస్ఐగా ఎ. శశికుమార్, నరసరావుపేట ఎస్ఐలుగా టి. తారాలక్ష్మి, కె. మురళీకృష్ణ, చిలకలూరిపేటకు సీహెచ్. దయాకర్, ఎం. గురవేశ్వరి, సత్తెనపల్లికి కె. నాగలక్ష్మి, క్రోసూరుకు టి. శ్రీనివాస్, పిడుగురాళ్లకు కె. కిరణ్‌కుమార్, గురజాలకు ఆర్.వి.వి. ప్రసాద్, మాచర్లకు ఎండీ. యాకుబ్ షరీఫ్, వినుకొండకు సీహెచ్. వినీల, డి. శ్రీనివాసరావు, ఈపూరుకు కె. శ్రీనివాసరావు, పిడుగురాళ్లకు డి. పీరుహుస్సేన్, నరసరావుపేట ఈఎస్‌టీఫ్ ఎస్ఐగా ఈ. కళ్యాణ్ చక్రవర్తి, నరసరావుపేట ఐఎంఎల్ డిపో ఎస్ఐగా జె. మాధవి, విజయపురి సౌత్ చెక్ పోస్ట్ ఎస్ఐగా ఎస్.వి. సుబ్బారావు, పొందుగల చెక్‌పోస్ట్ ఎస్ఐగా సీహెచ్ అనిల్‌కుమార్‌లను నియమిస్తూ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్యూమరేషన్‌లో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



ప్రజల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టంపై నిర్వహించిన ఎన్యూమరేషన్‌పై ఇబ్బందులున్నా, సక్రమంగా లేదని భావించినా ఫిర్యాదు చేస్తే విచారించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులకు గత నెల 25 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహార మొత్తాలను సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు.

అధికారుల హాజరు తప్పనిసరి

ప్రతి వారం అధికారులంతా క్రమం తప్పకుండా వేదిక కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు. ఒకే అర్జీ పరిష్కారం కోసం పదేపదే తిప్పుకోకుండా చూడాలని సూచించారు. పరిష్కారానికి అవకాశంలేని వాటిని ప్రజలకు వివరించి తెలపాలని చెప్పారు. అనంతరం వచ్చిన ప్రజల నుంచి వచ్చిన 190 ఫిర్యాదులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

పార్టీ ముద్రవేసి ఉద్యోగం తొలగింపు



నేను దివ్యజ్యోతి గ్రామైక్య సంఘంలో యానిమేటర్‌గా పని చేస్తున్నా. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానినని ఉద్యోగం నుంచి తొలగించారు. నేను ఎటువంటి తప్పుచేయలేదు. కేవలం రాజకీయ కక్షతోనే ఉపాధిని తీసేశారు. దళిత కుటుంబానికి చెందిన నాకు ఇద్దరు చిన్న ఆడపిల్లలున్నారు. న్యాయం చేయండి.

– దొప్పలపూడి ధనలక్ష్మి, తక్కెళ్లపాడు

సరిగా అందని పరిహారం



ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు పరిహారం సరిగ్గా అందడలేందు. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధుల్ని అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇవ్వడంలేదు. కేసు నమోదు చేయగానే ఇవ్వాల్సిన 25 శాతం, చార్జ్‌షీట్ నమోదు చేయగానే రావాల్సిన 75 శాతం పరిహారం అందడంలేదు. దళితుల కనీస హక్కులను రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాలి.

– ఈమని చంద్రశేఖర్, అధ్యక్షుడు జాతీయ మాలమహానాడు.

తెగుళ్లను తట్టుకునే వంగడాలు అందించాలి

- ఎన్జీరంగా వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి
- రబీ పంటలకు సన్నద్ధంపై రైతులకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ శారద జయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: రబీలో తెగుళ్లను తట్టుకునే వంగడాలను రైతులకు అందించాలని ఎన్జీరంగా వర్సిటీ వీసీ ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం విశ్వవిద్యాలయం పరిధిలోని విస్తరణ విభాగం ఆధ్వర్యంలో రబీ పంటలకు సన్నద్ధం అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో సోయాబీన్ పంటపై పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జీవన ఎరువులు, జీవ నియంత్రణపై రైతుల్లో అవగాహన కల్పించడం ద్వారా రసాయనాల వినియోగాన్ని తగ్గించవచ్చని చెప్పారు. ఖరీఫ్ పంట కాలంలో వాతావరణ పరిస్థితులు వల్ల చాలా ప్రాంతాల్లో అనేక పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రానున్న రబీలో వివిధ పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి పెంచే దిశగా శాస్త్రవేత్తలు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆమె సూచించారు. విశ్వవిద్యాలయం ద్వారా విడుదల చేసిన అధిక దిగుబడినిచ్చే రకాలు, టెక్నాలజీలను రైతులకు అందించాలని తెలిపారు. పరిశోధన సంచాలకులు పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ పంటల సాగుబడి, వైవిధ్యం అనే అంశాలపై దృష్టి సారించి రైతుల ఆదాయం పెంచే విధంగా కృషి చేయాలని చెప్పారు. విస్తరణ సంచాలకులు జి. శివన్నారాయణ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న వ్యవసాయ సమాచారాన్ని సేకరించి, వాటి నుంచి పరిశోధన, విస్తరణ అవగాహనకు కావాల్సిన విషయాలను గుర్తించాలని తెలిపారు. రైతు నికర ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలతో విశ్వవిద్యాలయం ముందుకెళ్లడం ద్వారా వారికి మరింత చేరువకావచ్చని సూచించారు. మాజీ విస్తరణ సంచాలకులు ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ అపరాల సాగులో మెలకువలు, రకాలు తెలియజేశారు. బి. రోశయ్య పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ, మందులు పిచికారీడ్రోన్ల ప్రాముఖ్యత తెలియజేశారు. జాతీయ వరి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. మహేంద్రకుమార్ మాట్లాడుతూ ఆరుతడి వరి పండించడం వల్ల ఉపయోగాలు, మెలకువలను వివరించారు. హైదరాబాద్‌కు చెందిన జాతీయ నూనె గింజల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త జి. సురేష్ మాట్లాడుతూ నూనె గింజలు వాటిలో మేలైన రకాలు, సాగు మెలకువలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని ఆరు జోన్లు నుంచి హాజరైన అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు ఖరీఫ్ పంట పరిస్థితి, రబీ పంట కాలంలో ఏఏ పంటలు పండించడానికి అవకాశాలు ఉన్నాయి, మేలైన రకాలు, విత్తన లబ్ధి, రైతుల వివిధ సమస్యలకు జవాబులు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి విస్తరణ, పరిశోధన శాస్త్రవేత్తలు, వివిధ పరిశోధన స్థానాల అధికారులు, విశ్వవిద్యాలయ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 4,200 గరిష్టం : రూ. 6,200

మోడల్ ధర రూ. 5,400

క్లుప్తంగా

మాతృ మరణాలను అరికట్టాలి: డీఎంహెచ్ఓ



సమీక్ష చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: మాతృ మరణాలను అరికట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు.జిల్లాలో గత నెలలో జరిగిన మూడు మాతృమరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం డీఎంహెచ్ఓ అధ్యక్షతన సబ్ డిస్టిక్ లెవెల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు మాతృ మరణాలు నివారించలేనివని సమావేశంలో నిర్ధారించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు క్రమం తప్పకుండా ప్రమాదకర గర్భిణులను పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. రక్తహీనత, షుగర్, బీపీ లక్షణాలున్న వాళ్లని తరచూ వైద్యాధికారి వద్దకు పరీక్షల కోసం పంపాలని తెలిపారు. ఆరోగ్య విద్య ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆహారంతో పాటు జాగ్రత్తలు తెలియజేయాలని చెప్పారు. మాతృ మరణాలు సంభవించకుండా బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్.అరుణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం. మజీదాబి, డాక్టర్ సుధీర్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, డాక్టర్ రాధికారాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, డాక్టర్ సీహెచ్. రత్నమన్మోహన్, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ ఈ. అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక , శ్రీధర్‌రెడ్డి , ఉమాదేవి , డాక్టర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులనే ఓటర్లుగా నమోదు చేయాలి

ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి సభ్యుల ఎన్నికలకు అర్హత ఉన్న వారినే ఓటర్లుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి సోమవారం ఆమె వర్చువల్ విధానంలో అధికారులతో మాట్లాడారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నమోదు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి ముగుస్తుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా తయారు చేయడానికి నోటిఫికేషన్ కూడా జారీ చేసిందని చెప్పారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అక్టోబర్ 16, 25 తేదీల్లో మరోసారి పబ్లిక్ నోటీస్ జారీ చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, నవంబర్ 6వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. నవంబర్ 20న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రింట్ చేసి, 23న పబ్లిష్ చేస్తామని తెలిపారు. జాబితాపై డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. డిసెంబర్ 25 నాటికి పరిష్కరించి అదే నెల 30న తుది ఓటరు జాబితాను పబ్లిష్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గత ఓటర్ల జాబితాను పరిగణలోకి తీసుకోరని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. రెండు ఎన్నికలకు సంబంధించి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా డీఆర్వో పెద్ది రోజా, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్‌గా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్‌లు ఉంటారని కలెక్టర్ తెలిపారు. ఓటరు నమోదు కోసం దరఖాస్తుతోపాటు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్‌ను గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకోవాలని చెప్పారు. దీని కోసం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డెప్యూటీ కమిషనర్లు, అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్, ఈఓపీఆర్డీ, పోస్ట్ మాస్టర్లను గుర్తించామని వెల్లడించారు. నవబంర్ 1, 2021న గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్ తర్వాత డిప్లమో చేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఓటర్ల నమోదుకు సంబంధించి ఫాం-18 దరఖాస్తులను 1.50 లక్షల కాపీలను ఇప్పటికే ప్రింట్ చేయించామని, వీటిని ఏఈఆర్వోలకు అందిస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో 2.5 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, ఈసారి 3.5 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశామని కలెక్టర్ వివరించారు. అనంతరం డీఆర్వో పెద్ది రోజా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికలకు సంబంధించి అవగాహన కల్పించారు.

నలుగురికి కారుణ్య నియామక పత్రాలు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజలు నలుగురికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కార్మిక శాఖ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆపరేషన్స్, బీసీ వెల్ఫేర్, ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్లలో నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు అందజేశారు. అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు హియరింగ్ బడ్స్

స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజలు విభిన్న ప్రతిభావంతులకు హియరింగ్ బడ్స్ అందజేశారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా స్వరూప్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రవి శర్మ సుమారు రూ.60 వేల విలువగల ఈ పరికరాలను 150 మందికి అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఆర్బీఎస్కే కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.



అంబటి రాంబాబుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేతలు

నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అంబటి రాంబాబును ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మందపాటి శేషగిరిరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో సమస్యలకు పరిష్కారం

ఎస్పీ సతీష్‌కుమార్



బాధితురాలి సమస్య అలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల గోడు ఆలకించారు. చిట్టీల పేరుతో మోసగించారని కొందరు, కుమార్తె మృతికి కారకులైన వారిని ఇంకనూ అరెస్ట్ చేయలేదని ఓ తల్లి ఆయనకు ఫిర్యాదు చేశారు. చట్టపరిధిలో బాధితుల సమస్యలకు పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. సత్వర న్యాయం దిశగా చర్యలు ఉండాలని స్పష్టం చేశారు. డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), సుబ్బారావు (మహిళా పీఎస్), రమేష్ (ట్రాఫిక్) కూడా అర్జీలు స్వీకరించారు.

ఉద్యోగం పేరుతో మోసం

గతేడాదిలో నా భర్త ప్రసాద్‌బాబుకి తాడేపల్లి వాసి పరిచయమయ్యారు. పలువురు బాగా తెలుసునని, కుమారుడైన ఏసోష్‌కు టూరిజం శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. నెలకు లక్ష రూపాయల జీతమని అన్నారు. దీంతో అతనికి గతేడాది ఏప్రిల్‌లో రూ.15 లక్షలు తాడేపల్లిలో చెల్లించాం. సాయంత్రం కల్లా నియామక ఉత్తర్వులు వస్తాయని నమ్మబలికాడు. నెలలు గడిచినా ఉద్యోగం ఇప్పించలేదు. ప్రస్తుతం డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. న్యాయం చేయగలరు.

– వై.మణెమ్మ, శ్యామలానగర్.

చిట్టీలతో దగా

స్థానికంగా ఉంటున్న భార్యభర్తల వద్ద చిట్టీలు వేశాం. దాదాపు 15 ఏళ్లుగా నమ్మకంగా ఉండటంతో సుమారు ఓ అరవై మంది చిట్టీలు వేస్తున్నాం. పాట పాడుకున్నాక డబ్బులు చెల్లించకపోవడంతో గత ఆదివారం ఇంటి వద్దకెళ్లాం. ఎవరూ లేరు. అయితే, గతనెల 21న ఇంటిని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేసి పరారైనట్లు తెలిసింది. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. వారి నుంచి సరైన స్పందన లేదు. ఈ క్రమంలో ఒకరూ తమకు కాల్ చేసి, రాజీకి రావాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. సుమారు రూ.3 కోట్లతో ఉడాయించినట్లు తెలిసింది. న్యాయం చేయగలరు.

– జి.నాగలక్ష్మి, అరుణ, సీహెచ్.లక్ష్మి, వి.బసవరాజు, విజయకుమార్‌రెడ్డి, కొరిటెపాడు, చైతన్యపురికాలనీ

మిగతా వారిని అరెస్టు చేయలేదు

రెండేళ్ల నుంచి మా కుమార్తె జనని (21) కనిపించడం లేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదిచ్చాం. ఈలోగా ఆమెను రత్నగిరినగర్ వాసి ఆనంద్ ప్రేమ పేరుతో పెళ్లి చేసుకున్నాడు. అయితే అతడి మేనమావ భార్య ఇచ్చిన ఫిర్యాదుతో మాపై తప్పుడు కేసు నమోదు చేయించారు. ఇక గతేడాది సెప్టెంబర్‌లో కుమార్తె జీజీహెచ్‌లో పాపను ప్రసవించగా, ఆమె మృతి చెందింది. అయితే, మా అమ్మాయి మృతికి భర్త, మరో నలుగురు వేధింపులే కారణమని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇటీవల ఆనంద్‌ను అరెస్ట్ చేయగా, మిగతా కుటుంబ సభ్యులను ఇప్పటి వరకు చేయలేదు. దీనిపై హోంమంత్రి అనిత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఫిర్యాదు చేశాం. ఇటీవల గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి విన్నవించాం. ఈ కేసులో మిగతా వార్ని అరెస్ట్ చేయాలంటూ ఐజీ గుంటూరు ఎస్పీకి రాశారు. అయితే, ఈ కేసుపై విచారణ పూర్తి కాలేదని చెబుతున్నారు. తప్పుడు కేసు నమోదు చేసిన వారిపై, కుమార్తె చావుకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని కోరుతున్నా.

– ఎస్.శంకరలీల, రత్నగిరినగర్

పది నిమిషాల్లో వస్తున్నానని అనంతలోకాలకు..

- కనకదుర్గ వారధిపై రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- కడుపు కోతను మిగిల్చావంటూ తల్లిదండ్రుల రోదన



కృప మనోజ్ (ఫైల్)

తాడేపల్లి రూరల్: పది నిమిషాల్లో వస్తున్నానన్నకొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ కృష్ణలంక బాలాజీ నగర్‌కు చెందిన సుధాబత్తుల శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడైన కృప మనోజ్ (21) డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. కొడుక్కి ఉద్యోగం వస్తే చేదోడు వాదోడుగా ఉంటాడని ఫౌండ్రీ పని చేసుకునే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు భావించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కృప మనోజ్ వారధి మీదుగా తాడేపల్లికి వచ్చాడు. 11.30 సమయంలో ఇంటికి తిరిగి వెళుతుండగా గుంటూరు–విజయవాడ రహదారిలోని కనకదుర్గ వారధి 16వ నంబర్ పిల్లర్ వద్ద వెనుక నుండి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృప మనోజ్ రోడ్డుపై పడడంతో ఒకవైపు శరీరంపై లారీ టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై మృతి చెందిన వ్యక్తి మనోజ్‌గా గుర్తించారు. మృతుడి జేబులో ఉన్న ఫోన్‌కు స్నేహితుల దగ్గర నుంచి ఫోన్ రావడంతో జరిగిన విషయం చెప్పడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన మనోజ్ తల్లి నాగలక్ష్మి గుండెలు పగిలేలా రోదించింది. "పది నిమిషాల్లో ఇంటికి వస్తానని చెప్పి మాకు కడుపుకోత మిగిల్చి.. అంతులేని లోకాలకు వెళ్లావా !" అంటూ మృతదేహంపై పడి దుఃఖించింది. పోలీసులు, బంధువులు ఆమెను సముదాయించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

- కాలిపోయిన రూ. 7లక్షల నగదు
- 83 గ్రాముల బంగారం, ఆస్తి దగ్ధం



కాలిపోయిన బీరువాను చూస్తున్న ఇంటి యజమాని


మంగళగిరి: గ్యాస్ సిలిండర్ పేలి కుమార్తె వివాహం కోసం ఇంటిలో ఉంచిన రూ. 7 లక్షలతో పాటు 83 గ్రాముల బంగారం, ఆస్తి దగ్ధమైన ఘటన మండలంలో నీరుకొండలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కురగంటి రమేష్ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. మూడో కుమార్తె వివాహం కొద్ది రోజుల్లో జరగనుంది. ఈ నేపథ్యంలో కురగల్లులో ఉన్న ఇంటిని రమేష్ రూ. 7లక్షలకు విక్రయించాడు. నగదును బీరువాలో ఉంచాడు. సోమవారం కుమార్తెను చూసేందుకు పెళ్లి కుమారుడు, కుటుంబసభ్యులు రానుండగా వారికి అవసరమైన వంటలు చేసేందుకు రమేష్ భార్య గ్యాస్ వెలిగించింది. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలుడుకు గురికావడంతో కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. మంటలకు బీరువాలో ఉంచిన రూ. 7 లక్షలతో పాటు 83 గ్రాముల బంగారం, సామగ్రి కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. తహసీల్దార్ షేక్ మాబు సుభాని ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పేద పిల్లలకు ఉచితంగా వినికిడి పరికరాల పంపిణీ



గుంటూరు మెడికల్: పేద పిల్లలకు వినికిడి పరికరాలను స్వరూప స్వచ్ఛంద సంస్థ అందించడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. గుంటూరులోని ఏపీ ఎన్జీవో కల్యాణ మండపంలో సోమవారం సంస్థ ఆధ్వర్యంలో 150 మంది పిల్లలకు కోటి రూపాయల విలువ చేసే వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఒక్కో పరికరం రూ. 60 వేలు ఉంటుందన్నారు. ఒక్కొక్క చిన్నారికి రెండు చెవులకు వినికిడి యంత్రాలు ఇవ్వడం వల్ల వారు సమస్యల నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో మరో 15 నుంచి 20 మిషన్లు అందుబాటులో ఉంచగలిగితే పేదవారికి అందించడానికి అవకాశం ఉంటుందని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ పేద విద్యార్థులకు వినికిడి పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. సంస్థ కృషిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో స్వరూప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సురేష్ పిల్లే, ఆర్‌బీఎస్‌కే నోడల్ జిల్లా ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డైక్ సెంటర్ మేనేజర్ పావులూరి నాగ శిరీష, ఆడియాలజిస్ట్ శ్రీ నవ్య పాల్గొన్నారు.

పీటీఎల్‌పీయూ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



గుంటూరు మెడికల్: ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ యూనియన్ (పీటీఎల్‌పీయూ) గుంటూరు జిల్లా శాఖ సమావేశం సోమవారం బ్రాడీపేటలోని జీవీఆర్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించారు. సమావేశంలో పీటీఎల్‌పీయూ జిల్లా అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రెటరీగా అశోక్, జిల్లా కోశాధికారిగా జైన్, వైస్ ప్రెసిడెంట్స్‌గా డేనియల్, ఎం.వేణు, ప్రియానంద్, యూ.నాగమల్లేశ్వరరావు, ముఖ్య సలహాదారుగా గుంటూరు హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత, సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్‌ను ఎన్నుకున్నారు. డిస్ట్రిక్ట్ చీఫ్ కన్వీనర్‌గా హోప్ విన్ హాస్పిటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, లీగల్ అడ్వైజర్‌గా చందు, మీడియా మేనేజర్‌గా కె.కిరణ్, సోషల్ మీడియా మేనేజర్‌గా కళ్యాణ్, రాష్ట్ర అధికారప్రతినిధిగా సీనియర్ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానను ఎన్నుకున్నారు.

ఆపదలో ఉన్నా.. ఆదుకోండి!

- 112కు ఫోన్ చేసిన మహిళ
- సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు
- పోలీసులపై దాడి చేసిన వ్యక్తి
- కానిస్టేబుల్ ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని అధికారులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెల్లెంపూడిలో నివాసముండే ఓ మహిళ తన భర్త నుంచి ప్రాణహాని ఉందంటూ ఆదివారం అర్ధరాత్రి 112కు ఫోన్ చేసింది. ఆమెతో పాటు ఆమె ఇంటికి ఎదురుగా ఉండే మరో మహిళ కూడా చేయడంతో జిల్లా కేంద్రం నుంచి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కానిస్టేబుల్ గిరిబాబు మెల్లెంపూడి వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న పోతురాజు బుజ్జి అనే వ్యక్తి "మా ఇంటికి ఎందుకు వచ్చావురా?" అంటూ దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఈ సంఘటనపై కానిస్టేబుల్ గిరిబాబు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో బుజ్జిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు గానీ అతనిపై చర్యలు లేకుండా పంపించి వేయడంతో సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులకు తలొగ్గి విధులు నిర్వహించడం అవమానంగా ఉందని వాపోయారు. కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడినా కనీసం డిపార్ట్‌మెంట్ అని సానుభూతి కూడా లేకుండా బుజ్జిని పంపించి వేడయంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీటీఐ రాష్ట్ర శాఖకు అవార్డు



తెనాలి: అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఏపీటీఐ) నిర్వహించిన 27వ జాతీయ ఏపీటీఐసీవోఎస్ కార్యక్రమాన్ని ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఉత్కల్ యూనివర్సిటీలో ఈనెల 27,28 తేదీల్లో నిర్వహించారు. ఇందులో ఏపీటీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు 2024కు ఉత్తమ అవార్డును ప్రదానం చేశారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్, ఏపీటీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మిలెన్ద్ జె.ఉమేకర్, ఏపీటీఐ సదరన్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వెంకటరమణ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటరమణ అవార్డును అందుకున్నారు. ఆయన స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ వై.అంకమ్మచౌదరి, డాక్టర్ ఎ.లక్ష్మణరావు, కార్యదర్శి డాక్టర్ డి.నరేంద్ర, విమెన్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ కె.పద్మలత, సంయుక్త కార్యదర్శి కె.హిమబిందు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు వివాహిత ఆత్మహత్యాయత్నం

- వివాహానికి నిరాకరణ
- చితకబాదిన ప్రియుడి బంధువులు





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బత్తుల గురవమ్మ (ఇన్‌సెట్) ఉప్పు శివయ్య (ఫైల్)

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సలాం హోటల్ సెంటర్‌లో నివాసముండే వివాహిత ఓ యువకుడి మోజులో పడి ఏడు లక్షల రూపాయలను ఇచ్చింది. భర్త, ఇద్దరు పిల్లల్ని వదిలి వేసి ప్రియుడితో ఊరు వదిలి పరారైంది. పెళ్లికి నిరాకరించడంతో ఇంటి ముందు బైఠాయించడంతో ప్రియుడు బంధువులు ఆమెను చితకబాదారు. దీంతో మనస్తాపం చెంది ఇంటిముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ అయిన బత్తుల గురవమ్మ, ఆమె బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సలాం హోటల్ సెంటర్‌లో నివాసముండే ఉప్పు శివయ్య డిగ్రీ వరకు చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంటూ గురవమ్మతో పాటు మట్టి పనికి వెళుతుండేవాడు. ఈ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించి అక్రమ సంబంధానికి దారి తీసింది. ఉద్యోగం పేరుతో పలుమార్లు శివయ్య గురవమ్మ వద్ద రూ. 7 లక్షల వరకు తీసుకున్నాడు. 15 రోజుల క్రితం పెళ్లి చేసుకుంటానంటూ నమ్మబలికి గురవమ్మను తీసుకుని ఆమె ఇంట్లో ఉన్న రూ.2లక్షలతో ఊరు వదిలి పరారయ్యారు. మొదట విశాఖపట్నం ఆ తరువాత తిరుపతి వెళ్లి అక్కడ నుంచి నరసరావు పేట వచ్చారు. నరసరావు పేట వచ్చిన తరువాత శివయ్య గురవమ్మ భర్త అయిన తిరుపతయ్యకు సమాచారం ఇచ్చాడు. ఆమెను నువ్వే ఏలుకో అంటూ చెప్పాడు. తాడేపల్లిలోని ఇంటికి వెళదామని చెప్పి గురవమ్మను తీసుకొచ్చి , అక్కడ నుంచి వెళ్లిపోయాడు. శివయ్య ఇంటికి వెళ్లి గురవమ్మ పెళ్లి చేసుకోమని నిలదీసింది. దీనికి అతడు కుటుంబ సభ్యులు ఆమెను చితకబాదారు. దీంతో గురవమ్మ ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. ఆమెను శివయ్య కుటుంబసభ్యులు మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్ వద్ద వదిలి వెళ్లారు. ఈ విషయాన్ని గురవమ్మ బంధువుతో ఆమె తల్లికి కబురు పంపారు. తన కూతుర్ని ఇబ్బంది పెట్టడం వల్లే మనస్తాపంతో ఆత్మహత్య ప్రయత్నం చేసిందని, జరిగిన సంఘటనపై మంత్రి నారా లోకేష్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని బాధిత మహిళ తల్లి తెలిపింది.

రైతులను ముంచిన కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం

- ఆందోళనలో గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలకు చెందిన మిర్చి రైతులు
- రైతుల మిర్చి బస్తాలపై బ్యాంకుల్లో రుణాలు
- రూ.15 కోట్లకుపైగా టోకరా
- రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ఎదుట బాధిత రైతుల ఆందోళన

గుంటూరు రూరల్: ఆరుగాలం శ్రమించి కష్టపడి చమటోడ్చి పండించిన పంటను మిర్చి ఎగుమతిదారుడిని నమ్మి కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచితే రైతులకు తెలియకుండా అమ్ముకున్నాడు. పైగా కొందరి రైతుల మిర్చిపై బ్యాంకులో రుణాలు పొంది వారిని కలిసేందుకు కూడా అనుమతి ఇవ్వలేదు. దీంతో బాధిత రైతులు సోమవారం నల్లపాడు రోడ్డులోని రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆందోళన చేశారు. కుమార్ స్పైసెస్‌కు చెందిన బచ్చనబోయిన రామచంద్రరావు నిల్వ చేసుకున్న మిర్చి బస్తాలను తెలియకుండా విక్రయించుకున్నాడని, అదేమని అడిగితే సమాధానం చెప్పడం లేదని రైతులు వాపోయారు. బాండ్‌లను బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు పొందారని ఆందోళన వ్యక్తం చేశారు.

బాధితులు కన్నీరుమున్నీరు

కర్నూలు జిల్లా దేవులపాడుకు చెందిన రైతు మారయ్య తన 210 బస్తాలను కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచితే వాటిని అమ్ముకున్నారని విలపించాడు. అదే జిల్లాకు చెందిన ఎం.రామాంజనేయులు 230 బస్తాలు, కుమారస్వామి 200 బస్తాలు జాడలేకుండా పోయాయని తెలిపారు. ప్రకాశం జిల్లా మల్లవరం గ్రామానికి చెందిన ఎం. గోవర్ధన్ 300 బస్తాలు, దుగ్గెంపూడి రామిరెడ్డి 130 బస్తాలు, డి. వెంకటేశ్వర రెడ్డి 110 బస్తాలు, ఓబులపతి 180 బస్తాలు, కె శ్రీనివాసరెడ్డి, ఉపేంద్రరెడ్డిలకు చెందిన సుమారు రూ 4 లక్షల రూపాయలు మిర్చిని మాయం చేశారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. గత మూడు నెలలుగా కోల్డ్‌స్టోరేజ్‌కు వస్తున్నా పట్టించుకోవటంలేదని, కనీసం తమ సరుకుని చూపించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదేమని అడిగితే రామచంద్రరావు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నాడని సమాధానం చెబుతున్నారని వాపోయారు. నాలుగు జిల్లాలకు చెందిన వందలాది మంది రైతులకు చెందిన మిర్చి బస్తాలు సుమారు రూ. 15 కోట్లకు పైగా ఉంటాయని తెలిపారు. ఇందులో ఎన్ని అమ్ముకున్నారో, ఎన్ని బస్తాలపై రుణాలు పొందారో తెలియడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కలుగజేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.